క్లుప్తంగా

ముగిసిన ఆయుర్వేద మర్మ వైద్య శిబిరం


మహిళకు మర్మ వైద్యం చేస్తున్న వైద్యుడు గురూజీ జైశ్రీరామ్

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ బీవీకే కళాశాలలో గో ఆధారిత వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సిద్ధ ఆయుర్వేద ఉచిత వైద్య శిబిరం బుధవారం ముగిసింది. రెండు రోజుల్లో ఈ శిబిరంలో సుమారు 300 మందికి సిద్ధ ఆయుర్వేద వైద్యుడు గురూజీ జైశ్రీరామ్, సిబ్బంది వైద్య సేవలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యుడు జైశ్రీరామ్‌ను గో ఆధారిత వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, సభ్యులు ఘనంగా సత్కరించారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు


స్నేహితులతో సరదాగా పరీక్ష హాల్లోకి..

ఏయూక్యాంపస్: పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు, ఆంగ్ల మాధ్యమం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలకు విద్యార్థులు నిర్ణీత సమయంలో చేరుకుంటున్నారు. ఉదయం 9 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రాలలోకి అనుమతిస్తున్నారు. విద్యార్థుల వెంట వారి తల్లిదండ్రులు రావడం పరీక్ష కేంద్రాల వద్ద సందడి కనిపించింది.

లాసన్స్ బేలో 'జబర్దస్త్' వర్ష సందడి


కుల్ఫీ తింటూ సందడి చేస్తున్న వర్ష

ఎంవీపీ కాలనీ: లాసన్స్ బే కాలనీలో జబర్దస్త్ ఫేమ్ వర్ష సందడి చేసింది. ముంబై కుల్ఫీ, డెస్టినీ కాఫీ హౌస్ పేరిట ఏర్పాటు చేసిన షాపును బుధవారం స్వామీజి శ్యామలానందతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖ అంటే తనకెంతో ఇష్టమని, ఎప్పుడు వచ్చినా ఇక్కడ సాగరతీరాన్ని ఆస్వాదిస్తానని వెల్లడించారు. ముంబై కుల్ఫీ, డెస్టినీ కాఫీ హౌస్ వంటి మరిన్ని యునిక్ బ్రాండ్‌లు విశాఖకు రావాలని ఆకాంక్షించారు.

విఫలమైన 'ప్రజాగళం' సభ

మద్దిలపాలెం : రాష్ట్ర ప్రజలను నమ్మించేందుకు ఇటీవల టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రజాగళం పేరుతో నిర్వహించిన సభ విఫలమైందని కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూలా వెంకటరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టులేని మూడు పార్టీలు కూటమిగా ఏర్పడి ప్రజల విశ్వాసాన్ని పొందాలని విఫల యత్నం చేస్తున్నాయన్నారు. బూటకపు మాటలతో ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. విభజన హామీలను పక్కన పెట్టి ప్రజలకు కట్టుకథలు చెప్పి ఓట్లు దండుకోవడానికి సిద్ధపడుతున్నాయని మండిపడ్డారు. 2024 ఎన్నికలలో విజ్ఞతతో ఓట్లు వేయడానికి ఓటర్లు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

జాలరిపేటలో టీడీపీ ఎదురీత!

- ప్రచారానికి ముఖం చాటేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీవీకి పెరుగుతున్న మత్స్యకారుల మద్దతు
- అభివృద్ధి కార్యక్రమాలు.. సహపంక్తి భోజనాలతో మమేకం


జాలరిపేటలో కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎంవీవీ సత్యనారాయణ(ఫైల్)


ఇటీవల మత్స్యకార పెద్దలతో కలిసి నేలపై కూర్చుని సహపంక్తి భోజనం చేస్తున్న ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డు జాలరిపేటలో టీడీపీ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోంది. ప్రస్తుతం ఆ పార్టీకి జాలరిపేటలో నాయకత్వం కరువై విలవిల్లాడుతోంది.

ఒకప్పుడు టీడీపీకి జాలరిపేటలో మంచి పట్టు ఉండేది. ప్రస్తుతం పరిస్థితులు అందుకు భిన్నంగా మారాయి. మత్స్యకారులను ఓటు బ్యాంకుగా చూసిన ఆయన.. గెలిచిన మూడు సార్లు కనీసం అభివృద్ధి పనులు చేపట్టలేదు. మత్స్యకారులు కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోలేకపోయారు. దీంతో టీడీపీ తరఫున జాలరిపేటలో కనీసం ప్రచారం చేసేవారు కానరావడం లేదు. అందుకే వెలగపూడి ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆ పార్టీ నాయకులే గుసగుసలాడుకుంటున్నారు.

మరో వైపు వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు జాలరిపేట మత్స్యకారుల నుంచి రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఎంవీవీ ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టిసారించారు. స్థానిక మత్స్యకారుల్లో విశ్వాసాన్ని, నమ్మకాన్ని కలిగించే దిశగా పార్టీ శ్రేణులను ముందుకు నడిపించారు. స్థానికులకు సంబంధించిన ప్రతి కార్యక్రమంలోను పాల్గొని వారితో మమేకమయ్యారు. ప్రతి ఇంటా అక్కచెల్లెమ్మలు చేసిన వంటను స్థానిక మత్స్యకారులతో కలిసి రుచిచూశారు. ప్రతి కష్టంలోను నేనున్నానంటూ భరోసా కల్పించారు. స్థానిక సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారం దిశగా వేగంగా ముందుకు సాగుతూ తక్కువ సమయంలోనే జాలరిపేటలో మార్పునకు నాంది పలికారు.

రూ.కోట్ల అభివృద్ధితో మారిన ముఖచిత్రం

స్థానిక మత్స్యకారులను తొలి నుంచి ఓటు బ్యాంకుగా చూసిన ఎమ్మెల్యే వెలగపూడి.. ఈ ప్రాంతానికి చేసింది శూన్యమనే చెప్పొచ్చు. ఆయన ఎమ్మెల్యేగా మూడు సార్లు గెలిచినప్పటికీ పెదజాలరిపేట పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదు. ఎంపీ ఎంవీవీ మాత్రం తొలి నుంచి ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. వార్డు పర్యటనల్లో విస్తృతంగా పాల్గొనడంతో పాటు అక్కడి సమస్యలపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తూ వచ్చారు. ఇందులో భాగంగా స్థానిక మత్స్యకారులు తన దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా పనిచేశారు. తమకు ఇస్తున్న ప్రాధాన్యం, చేస్తున్న అభివృద్ధి నేపథ్యంలో స్థానిక మత్స్యకార సంఘం పెద్ద పరసన్న బృందం సైతం ఎంవీవీ నాయకత్వానికి మద్దతు పలికింది. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న యూజీడీ నిర్మాణం(రూ.35 కోట్లు), టిడ్కో ఇళ్ల మంజూరు, ప్రధాన రహదారి నిర్మాణం (రూ.98లక్షలు), స్థానిక దేవాలయాలను సొంత నిధులతో (రూ.కోటి) ఆధునికీకరించడం వంటి విస్తృత అభివృద్ధి కార్యక్రమాలు ఎంవీవీ శ్రీకారం చుట్టారు. రూ.1.09 కోట్లతో జాలరిపేట వాసుల కోసం ప్రత్యేక కమ్యూనిటీ హాల్ నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రానికి సైతం ఎంపీ ఎంవీవీ గత నెలలో శంకుస్థాపన చేయడం, ఈ ప్రాంత ప్రజలకు జగనన్న ఇంటి పట్టాల అందజేయడంలో ప్రత్యేక శ్రద్ధ వహించడం ఈ ప్రాంత అభివృద్ధిపై ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనమంటూ స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.

10వ వార్డు 'పచ్చ'పార్టీలో లొల్లి

ఆరిలోవ: విశాఖ తూర్పు నియోజకవర్గ పరిధిలో 10వ వార్డు టీడీపీలో లుకలుకలు ఎక్కువయ్యాయి. ఆ పార్టీ కార్యకర్తల్లో వర్గపోరు తారాస్థాయికి చేరడంతో ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడికి తలనొప్పిగా మారింది. ఏం చేయాలో పాలుపోక ఆయన మదనపడుతున్నట్టు ఆ పార్టీ నాయకులు చెప్పుకుంటున్నారు. ఈ వార్డుపై పక్క వార్డుకు చెందిన టీడీపీ నాయకుల పెత్తనం చేస్తుండడంతో ఈ లొల్లికి కారణమని తెలుస్తోంది. 10వ వార్డులో టీడీపీ కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి భర్త రాజశేఖర్ షాడో కార్పొరేటర్‌గా పెత్తనం చలాయిస్తున్నారు. కార్యకర్తలను పట్టించుకోవడం లేదని, ఒక వర్గానికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆయనపై విమర్శలు ఉన్నాయి. దీంతో ఆయన ఏ కార్యక్రమం చేసినా రెండో వర్గం కార్యకర్తలు ముఖం చాటేస్తున్నారు. అంతే కాకుండా ఆయనపై అసంతృప్తిగా ఉన్న కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు కూడా చేశారు. ఈ క్రమంలో వెలగపూడి ఇటీవల వ్యతిరేక వర్గానికి పరోక్షంగా మద్దతుగా నిలిచారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ప్రోద్బలంతో 9, 12 వార్డులకు చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు.. 10వ వార్డులో రాజశేఖర్ వ్యతిరేక వర్గానికి మద్దతు పలికి పెత్తనం చేస్తున్నారు. దీంతో కార్పొరేటర్ వర్గం ఎమ్మెల్యే తీరుపై అసంతృప్తితో రగిలిపోతోంది. వార్డులో ఆ పార్టీ కార్యక్రమాలు చేయడం తగ్గించేశారు. మరికొన్ని కార్యక్రమాలకు కార్పొరేటర్ హాజరు కావడంలేదు. దీంతో ఈ వర్గపోరు సమస్య నుంచి బయట పడడానికి వెలగపూడి నానా తంటాలు పడుతున్నారట. ఎన్నికల ముందు ఇదేమి సమస్యరా బాబో అంటూ మదనపడుతున్నారట. అసలే వార్డులో వైఎస్సార్‌సీపీ ప్రచారంలో దూసుకుపోతూ ఆ పార్టీ బలోపేతమవుతోందని, ఇలాంటి సమయంలో వార్డులో టీడీపీ వర్గపోరు ఎమ్మెల్యేకి కంటిమీద కునుకులేకుండా చేస్తోందని ఆ పార్టీ నాయకులు బాహటంగా చర్చించుకుంటున్నారు.

సార్.. మద్దతివ్వండి

- సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణను కలిసి ఎంపీ ఎంవీవీ వినతి
- 19వ వార్డులో విస్తృత ప్రచారం


జైభారత్ పార్టీ అధినేత లక్ష్మీనారాయణకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ జనం కోసం.. జనంలోనే పేరిట చేపట్టిన పాదయాత్ర బుధవారం 19వ వార్డులో కొనసాగింది. ప్రజలు నీరాజనాలు అందుకుంటూ ఎంపీ ఎంవీవీ 66వ రోజు ఎంవీపీ కాలనీ సెక్టార్-12, లాసన్స్ బే కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజా కర్షక పాలనను వివరించారు. జై భారత్ పార్టీ అధినేత, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణను కలిసి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేసి, మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా సంక్షేమ కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వసంత, గణేష్, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమాలు ఉల్లంఘిస్తే ఫిర్యాదు చేయండి

ఆరిలోవ: విశాఖ తూర్పు నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై ఫిర్యాదులు స్వీకరించనున్నట్టు నియోజకవర్గం నోడల్ ఆఫీసర్ జె.విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల నియమావళి కోసం జీవీఎంసీ జోన్-3 కార్యాలయంలో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదులు చేయడానికి 0891-2746314 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ నంబర్ 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు.

పక్కాగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు


హాజరైన వివిధ పార్టీల నాయకులు, వివిధ శాఖల అధికారులు


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్, చిత్రంలో జెడ్పీ విజయలక్ష్మి,

మహారాణిపేట: ఎన్నికల ప్రవర్తన నియమావళి(మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)ని ప్రతి రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పక్కాగా అమలు చేయాలని విశాఖ తూర్పు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. బుధవారం ఆశీలమెట్ట జీవీఎంసీ జోనల్-3 కార్యాలయంలో నిర్వహించిన అఖిల పక్షం, ఏఆర్‌వోలు, ఇతర ఎన్నికల సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదలైందని, ఈ మేరకు నియోజకవర్గంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. కంట్రోల్ రూమ్‌ను సిద్ధం చేసి, ఇక్కడ అధికారి, ఇతర సిబ్బందిని నియమించామన్నారు. జోన్-3 కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కంట్రోల్ రూమ్ 24 గంటలూ పని చేస్తుందన్నారు. సామాన్య ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై ఫోన్ ద్వారా లేదా నేరుగా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. 0891-2746314 నంబర్‌కు ఫోన్ చేయవచ్చునని చెప్పారు. పలువురు పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదుపై అనుమానాలు వ్యక్తం చేశారు. వాటికి రిటర్నింగ్ అధికారి మయూర్ అశోక్ సమాధానం ఇచ్చారు.

వలంటీర్ తొలగింపు

ఓ పార్టీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారన్న ఆరోపణపై 19వ వార్డు పరిధిలోని సచివాలయం (1086095)కు చెందిన పి.కరుణ అనే వలంటీర్‌ను విధుల నుంచి తొలగించినట్టు జేసీ తెలిపారు. అలాగే పోలీసు కేసు నమోదైనట్టు ఆయన వివరించారు.

వ్యవసాయంలో ఏఐ సాంకేతికతపై అవగాహన


అభిరామ్ సరస్వతిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస రావు

ఏయూ క్యాంపస్: వ్యవసాయ రంగంలో ఆర్టిఫీషియల్ సాంకేతికత(ఏఐ) ఉపయోగాలపై అమెరికాలో స్థిరపడిన డాక్టర్ అభిరామ్ సరస్వతి అవగాహన కల్పించారు.

బుధవారం ఏయూ జువాలజీ విభాగంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. డేటా సైన్స్ రంగంలో అవకాశాలను వివరించారు. టీ కాబ్స్-ఈ నిర్వాహకులు డాక్టర్ వై.రవికిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, జువాలజీ విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా అభిరామ్ సరస్వతిని వర్సిటీ తరఫున సత్కరించారు.

విజయవంతంగా ఆరోగ్య సురక్ష శిబిరాలు

10 ప్రాంతాల్లో 2,899 మందికి వైద్య సేవలు

మహారాణిపేట: ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా బుధవారం తోటవీధి (భీమిలి), పెందుర్తి, శ్రామికనగర్, నక్కవానిపాలెం, లంకెలపాలెం, రైల్వే న్యూకాలనీ, శివనగర్, దొండపర్తి, పాత రేసవానిపాలెం(స్వర్ణభారతి), తోటగరువు, బక్కన్నపాలెంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో మొత్తం 2,899 మందికి వైద్య సేవలందించారు. 30 మందిని ఉన్నత వైద్యం కోసం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రులకు, 12 మందిని కంటి చికిత్స కోసం ప్రాంతీయ కంటి ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. గురువారం నగర పరిధిలోని బాలాజీనగర్, ఎంఎస్‌ఆర్ నగర్, లాసన్స్‌బే కాలనీ, ఇసుకతోట, రైల్వే న్యూకాలనీ, జబ్బరితోట, కంచరపాలెం, సిద్ధేశ్వరం, న్యూగాజువాక, నరసింహనగర్‌లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు.

హిందీ లోయర్ పరీక్ష ఫలితాలు విడుదల

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచార సభ-చెన్నై ఆధ్వర్యంలో గత నెల 10, 11వ తేదీల్లో నిర్వహించిన హిందీ లోయర్ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ కేంద్రంగా జరిగిన పరీక్షల్లో 36 మందికి గానూ 25 మంది ప్రథమ శ్రేణిలో, 11 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్టు ఆదర్శ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు.

ఇందు కోసమా రోడ్డు విస్తరణ?


చినగదిలి సాయిబాబా ఆలయం నుంచి సూర్యతేజానగర్ కొత్త రోడ్డులో నిలిపిన కార్లు


ఫుట్‌పాత్ తవ్వేసి ప్రవేశ ద్వారం ఏర్పాటు చేసిన కేర్ ఆస్పత్రి

ఆరిలోవ: ప్రజల అవసరాల కోసం జీవీఎంసీ రూ.కోట్ల నిధులు వెచ్చించి రోడ్లు నిర్మించింది. ఆ రోడ్లు వాహనాల రాకపోకలకు అనువుగా ఉండేటట్లు తయారు చేసింది. అయితే ఆ రహదారులను కొందరు వాహనాలకు పార్కింగ్ స్థలాలుగా ఉపయోగించుకోగా.. మరికొందరు సొంత అవసరాల కోసం వినియోగించుకుంటున్నారు. బీఆర్‌టీఎస్‌లో చినగదిలి కూడలి నుంచి సూర్యతేజానగర్ వరకు 400 మీటర్లు పొడవున రూ.2.35 కోట్లు 15వ ఆర్థిక సంఘం నిధులతో జీవీఎంసీ అధికారులు గతేడాది డబుల్ రోడ్డు నిర్మించారు. ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు ఎలాంటి సమస్య ఉండదని అంతా భావించారు. అయితే ఇందుకు భిన్నంగా ఈ రోడ్డును పలువురు తమ వాహనాలకు పార్కింగ్ స్థలంగా ఉపయోగించుకుంటున్నారు. ఈ మార్గంలో ఓ పక్క కార్లు, లారీలు, ట్రావెల్ బస్సులు యథేచ్ఛగా నిలిపేస్తున్నారు. మరో వైపు ఆ వాహనాలకు ఎదురుగా కేర్ ఆస్పత్రి నిర్వాహకులు అనధికారికంగా ప్రవేశ ద్వారం ఏర్పాటు చేశారు. కొత్తగా నిర్మించిన ఫుట్‌పాత్ తొలగించి ద్వారం ఏర్పాటు చేయడం గమనార్హం. ఆ ద్వారం నుంచి అంబులెన్స్‌లు, ఇతర వాహనాల రాకపోకలు చేపడుతున్నారు. ఇరుకుగా ఉన్న ఈ రహదారిని రూ.కోట్లు వెచ్చించి విస్తరించినా ఫలితం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ రోడ్డుపై వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టాలని, రోడ్డు వైపు ఏర్పాటు చేసిన ఆస్పత్రి ప్రవేశ ద్వారం మూయించాలని కోరుతున్నారు.

ఉపాధి, శిక్షణపై ఎంవోయూ

అగనంపూడి: ఉపాధి, నైపుణ్య శిక్షణ, అవగాహన కార్యక్రమాలపై పరస్పర సహకారం అందించే లక్ష్యంతో దువ్వాడలోని ఫార్మాస్యూటికల్ కళాశాల, సీఎస్‌సీ అకాడమీ ఒప్పందం చేసుకున్నాయి. ఈ మేరకు దువ్వాడలోని కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, సీఎస్‌సీ అకాడమీ సలహాదారు రామ్మోహనరావు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

నేటి నుంచి వాలీబాల్ టోర్నీ

విశాఖ స్పోర్ట్స్ : ఆలిండియా ఆహ్వాన వాలీబాల్ చాంపియన్‌షిప్ డీఆర్‌ఎం కప్ ఈకోర్స్ వాల్తేర్ ఆధ్వర్యంలో గురువారం నుంచి ప్రారంభం కానుంది. మెన్‌లో ఎనిమిది జట్లు.. వుమెన్‌లో నాలుగు జట్లు పోటీపడనున్నాయి. నాలుగు రోజుల పాటు రైల్వే స్టేడియం వాలీబాల్ కోర్టులో జరిగే ఈ పోటీల్లో కిట్ యూనివర్సిటీ, డిబి క్లబ్, ఈకోరైల్వే, సాయ్, సెయింట్ జాన్స్ కాలేజ్, తూర్పు గోదావరి, శ్రీకాకుళం, ప్రకాశం జిల్లా జట్లు మెన్‌లో తలపడనుండగా.. వుమెన్‌లో కిట్ వర్సిటీ, జీపీయర్ యూనివర్సిటీ, చెన్నై కాలేజ్, ఎన్‌బీపీ ట్రస్ట్ జట్లు పోటీపడనున్నాయి. ఈ సందర్భంగా బుధవారం డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహు టోర్నీ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఈకోర్స్ వాల్తేర్ క్రీడాధికారి ప్రవీణ్‌భాటి, జాయింట్ క్రీడాధికారి బి.అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

హిందీ భాషాభివృద్ధిపై కమిటీ సమావేశం


విశాఖ వాణి మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, అధికారులు

తాటిచెట్లపాలెం: దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయంలో బుధవారం డివిజనల్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల అధికారులతో గత త్రైమాసిక ఫలితాలు, 2024-25 సంవత్సర ప్రణాళికలు, రాబోయే రోజుల్లో హిందీ భాషాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, శిక్షణ కోసం నమోదు వంటి విషయాల గురించి చర్చించారు. వాల్తేర్ డివిజన్ ప్రచురించిన విశాఖ వాణి మ్యాగజైన్‌ను డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ ఆవిష్కరించారు. హిందీ భాష ప్రాముఖ్యాన్ని అన్ని విభాగాల్లో తెలియజేసి, మరింత ఎక్కువ మంది వినియోగించేలా చేయాలని ఆయన సూచించారు. విశాఖ వాణి మ్యాగజైన్‌లో పలు శీర్షికలు రాసిన అధికారులను డీఆర్‌ఎం అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, వాల్తేర్ డివిజన్ రాజభాషా అధికారి వీరేంద్ర కాజీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డౌన్ సిండ్రోమ్‌తో జీవన ప్రమాణం తగ్గుముఖం

నేడు వరల్డ్ డౌన్ సిండ్రోమ్ డే

మహారాణిపేట : ప్రతి వెయ్యి మంది పిల్లల్లో ఒకరికి డౌన్ సిండ్రోమ్ సోకుతోందని, దీని వల్ల జీవన ప్రమాణం తక్కువగా ఉంటుందని సొసైటీ ఆఫ్ ఫీటల్ మెడిసిన్ ఆంధ్రప్రదేశ్ చాప్టర్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ కె.వి.శ్రీదేవి తెలిపారు. గర్భంలో శిశువు ఉండగానే వ్యాధి నిర్ధారణ పరీక్షల ద్వారా శిశువు ఆరోగ్య స్థితి తెలుసుకోవచ్చన్నారు. దీనికి అనేక కొత్త విధానాలు, అధునాతన ప్రక్రియలు వచ్చాయని బుధవారం మీడియాకు వివరించారు. ప్రతి ఏడాది మార్చి 21వ తేదీన వరల్డ్ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం నిర్వహిస్తామని, దీని ద్వారా వచ్చే వ్యాధులు, ఇబ్బందులు, తీసుకోనవలసిన జాగ్రత్తలపై తమ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. డౌన్ సిండ్రోమ్ అనేది జన్యుపరమైన అంశమన్నారు. ఈ కారణంగా గుండె సంబంధిత వ్యాధులు, దృష్టి, వినికిడి, థైరాయిడ్ సమస్యలు, బుద్ధిమాంద్యం వంటి సమస్యలతో పిల్లలు జన్మిస్తారని వివరించారు. ఫలితంగా పిల్లల జీవన ప్రమాణం తక్కువగా ఉంటుందన్నారు. వయసు మీరిన తర్వాత పిల్లల్ని కనడం వల్ల ఇలాంటి సమస్యలు వస్తాయన్నారు. గర్భం దాల్చిన 11 వారాల నుంచి పరీక్షలు చేసి డౌన్ సిండ్రోమ్‌ను గుర్తించవనని డాక్టర్ శ్రీదేవి తెలిపారు.

స్ప్లాష్ విజేతగా అక్షిత


అక్షిత


అక్షిత గీసిన చిత్రం

బీచ్ రోడ్డు: దేశ వ్యాప్తంగా యాక్సిస్ బ్యాంకు నిర్వహించిన ఆర్ట్, క్రాఫ్ట్, సాహిత్య పోటీ స్ప్లాష్ విజేతగా నగరానికి చెందిన పి.అక్షిత నిలిచారు. 11 నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సు గ్రూప్‌లో ఆర్ట్ పోటీలో అక్షిత ప్రతిభకనబరిచింది. ఆమెకు యాక్సిస్ బ్యాంకు రూ.లక్ష స్కాలర్‌షిప్‌ను అందించింది. ఈ పోటీలకు దేశ వ్యాప్తంగా 6.8 లక్షల మంది హాజరయ్యారు. వారిలో అక్షిత విజేతగా నిలవడంపై పలువురు అభినందనలు తెలియజేస్తున్నారు.

23న సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ఈ నెల 23 ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడసేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వెండిగరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని అధిష్టంపజేసి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చేవరకూ పోరాటం


1133వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు కార్మికుల పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. వారి సంకల్పానికి, పోరాట శక్తికి ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం దిగి రాక తప్పదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలోని ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1133వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.